సంతకు స్థలాలు కరువు

- రోడ్లపైనే నిర్వహణ
- ఏటా రూ.లక్షల్లో ఆదాయం
- పట్టించుకోని ఆదాయం


చారకొండ ప్రధాన రహదారిపై కూరగాయల సంత

చారకొండ: గ్రామీణ ప్రజలకు సంత కష్టాలు తీరడం లేదు. ఎన్నో వ్యయప్రయాసాలు పడి సంతకు చేరుకుంటే సంతలో అరకొర వసతులతో అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతులు, కొనగోలుదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కూరగాయలు కొనుగోలు చేయాలన్నా సరిపడా స్థలంలేక రైతులు రోడ్లపైనే విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ట్రాఫిక్‌జాం అయి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు

ప్రధాన రహదారిపైనే సంత

మండల కేంద్రంలో కూరగాయల సంత ప్రధాన రహదారిపైనే నిర్వహిస్తున్నారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఆయా గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల రాకపోకలతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి శనివారం కూరగాయాల సంత తోపాటు మేకల సంత నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన కొనుగోలుదారులతో సంత రద్దీగా ఉంటోంది. మండల కేంద్రంలోని మేకల సంతను, ప్రతి ఆదివారం జూపల్లిలో నిర్వహించే మేకల సంతను ప్రైవేట్ స్థలాలలో నిర్వహిస్తున్నారు.

పంచాయతీలకు ఆదాయం

కూరగాయల, మేకల సంతల నిర్వహణతోనే మండల కేంద్రంలోని పంచాయతీకి, జూపల్లి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయంతోనే ఆయా గ్రామాల్లో వివిధ పనులు చేపడుతున్నారు. కాని అధికారులకు, పాలకులకు ఆదాయంపైన ఉన్న ధ్యాస సౌకర్యాల కల్పనలో ఉంచడం లేదు. కొన్ని దశాబ్దాల కాలం నుంచి చారకొండ అంగడీకి మంది తరలివస్తుంటారు. పక్కన ఉన్న నల్గొండ జిల్లా నుంచి కూడా రైతులు కూరగాయలు విక్రయించేందుకు వస్తుంటారు.

మూడు ఏళ్లలో మేకల సంత ఆదాయం

సంవత్సరం	చారకొండ (రూ.లక్షల్లో)	జూపల్లి (రూ.లక్షల్లో)
2023–24	2,55,000	450,000
2024–25	3,15,000	5,11,000
2025–26	3,52,000	6,06,000

ప్రభుత్వం దృష్టి సారించాలి



మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే సంతలో వ్యాపారులకు ఎలాంటి సౌకర్యాలు లేవు. వ్యాపారుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నాం. అధికారులు చొరవ తీసుకొని మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలి.

– రాములమ్మ, కూరగాయల వ్యాపారి

సమస్య పరిష్కారానికి కృషి



మండలంలోని మేకల సంతకు స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. సంతలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు, కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. స్థలం సేకరణ కోసం పాలకులకు వివరించాం.

– నారాయణ, ఎంపీఓ, చారకొండ

ఆపరేషన్ మహావీర్ జవాన్లకు జేజేలు


జాతీయ జెండాలు పట్టుకొని నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

అచ్చంపేట రూరల్: పహల్గాం దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయక ప్రజలకు శుక్రవారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలో అంజనీమాత సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థినులు ఘన నివాళులర్పించారు. పాకిస్తాన్ ముష్కరులను మట్టికరిపించిన ఆపరేషన్ మహావీర్ పాల్గొన్న జవాన్లకు జేజేలు పలుకుతూ జయహో సిందూర్.. జయహో భారత్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనీమాత సేవాసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మండికారి బాలాజీ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో భారత జవానులు అసమాన్యమైన ధైర్య సాహసాలు ప్రదర్శించి పాకిస్తాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పారన్నారు. తిరంగా జెండాలను పట్టుకుని భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బాలాజీ, సునీతాబాయి, హేమలత, సంగీతాబాయి, శకుంతల, మంగమ్మ, కృష్ణవేణి, లక్ష్మీబాయి, అశ్విని, సీతమ్మ, కవిత, శైలజ, ప్రతిమ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలులో ప్రభుత్వం విఫలం

పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అ. ధ్యక్షుడు పరశురామ్ విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా ఆడపిల్లలకు రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని మాట తప్పిందన్నారు. మండలానికి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ల మెటీరీయల్‌ను రెండు నెలల నుంచి పంపిణీ చేయకుండా సబ్‌స్టేషన్‌లో ఉంచడం సరికాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి అవాజ్ యోజన కింద రూ. 1.,33 లక్షలు ఇస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని కోరారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గుండాలశివ, తిరుమల్‌యాదవ్, మేకల శివ, బంటుపల్లి శివ పాల్గొన్నారు.

సభకు తరలి రావాలి

పెంట్లవెల్లి: కొల్లాపూర్‌లో శనివారం నిర్వహించే భారీ బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు ఇస్తారని వివరించారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో పురోహితుడు ప్రవీణ్‌కుమార్ శర్మ, గీతారాణి, సువర్ణ, సంధ్యా, హేమలత, సాయిలీల, కవిత, విమల, అరుణ, జ్యోతి, హైమావతి, లక్ష్మి పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లుతండాలో పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించి డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పంతునాయక్, సీఆర్‌పీ అంజ్యానాయక్, మాజీ ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, రమేష్, పంతు, భాస్కర్, చంద్రశేఖర్ ఉన్నారు.

ఏపీఎంగా శ్రీదేవి

వెల్దండ: మండల మహిళ సమాఖ్య ఏపీఎంగా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల ఏపీఎంగా విధులు నిర్వర్తించిన శ్రీదేవి సాధారణ బదిలీపై వచ్చారు. అదే విధంగా వెల్దండ ఏపీఎంగా ఉన్న ఈశ్వర్ బిజినేపల్లి మండలానికి బదిలీ అయ్యారు. మండల మహిళ సమాఖ్య అధికారులు వారిని సన్మానించారు. మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు భారతమ్మ, సీసీలు యాదగిరి, గెల్వమ్మ, కిష్టమ్మ, రాము, పాండు, అరుణ్ తదితరులు ఉన్నారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

చారకొండ: ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని మండల వైద్యాధికారి మంజు బార్గవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సృజన, అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ, ఏఎన్‌ఎం అలివేలు ఉన్నారు.

బిజినేపల్లి: మండలంలోని పాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పాలెం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ గజవర్ధనమ్మ గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను, లాభాలను వివరించారు. ఐసీడీఎస్ పర్యవేక్షకులు రేణుక, ఆశాలు పార్వతి, జయమ్మ, షమీం, కారుకొండ, వసంతాపూర్, వేంకటాపూర్, ఖానాపూర్, నందివడ్డెమాన్ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సోమశిలను సందర్శించిన ఓయూ అధ్యాపకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామాన్ని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యాపకుల బృందం శుక్రవారం సోమశిలను సందర్శించింది. ఈ సందర్భంగా పాత్యంశాలలో ఉన్న చారిత్రక ప్రదేశాల సందర్శనలో భాగంగా లలిత సోమేశ్వర స్వామి గుడిని సందర్శించి అక్కడి వారితో స్థల పురాణాలను చారిత్రక నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన డబుల్ డెక్కర్ ఏసీ లాంచ్‌లో నదిలో విహరించారు. సోమేశ్వరాలయంలో జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. ఆచార్య సాగి కమలాకర శర్మ, ఆచార్యులు ఎస్ రఘు, మహేందర్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


సోమేశ్వరాలయంలో అధ్యాపకులు, విద్యార్థులు

మానవ అక్రమ రవాణా నేరం



కోడేరు: మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని షీటీమ్ జిల్లా ఇన్‌చార్జ్ విజయలక్ష్మి, ఎస్‌ఐ వీణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, సైబర్‌క్రైమ్ మోసాలు, వీధుల్లో వేధింపులు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, నర్సింహులు, పద్మావతమ్మ, వెంకటయ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

బల్మూర్: సీపీఐ పార్టీ కౌన్సిల్ మెంబర్ చందునాయక్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు భరోసా ఇచ్చారు. గత నెల 15న హైదరాబాద్‌లోని మలక్‌పేట్‌లో చందు హత్యకు గురైన విషయం తెలిసిందే. శుక్రవారం చందు స్వగ్రామం బల్మూర్ మండలంలోని నర్సాయపల్లిలో కూనంనేని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడా వెంకట్‌రెడ్డి, ఈటీ నర్సింహ్మలతో కలిసి బాధత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చందునాయక్ కూతురు ఉన్నత చందువులకు అయ్యే ఖర్చులలను పార్టీ పరంగా భరిస్తామని భరోసా ఇచ్చారు. కుమారుడికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మాజీ సర్పంచ్ దేశ్యానాయక్, నాయకులు ఉన్నారు.

కార్యకర్త మృతికి సంతాపం

కల్వకుర్తి రూరల్: పట్టణంలో సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న పెద్ద కొత్తపల్లి మండలం దేవుని తిరుమలపూర్ గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త శ్రీను (45) గుండెపోటుతో మృతి చెందాడు. ర్యాలీలో ఉన్న సమయంలో గుండెలో నొప్పి వస్తుందని తోటి కార్యకర్తలకు చెప్పడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆస్పత్రికి చేరుకొని నివాళులర్పించారు.

ఆలయాభివృద్ధికి కృషి



అచ్చంపేట రూరల్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అయ్యప్ప స్వామి నూతన దేవాలయ నిర్మాణంలో భాగంగా పడి ప్రతిష్ఠించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం వేగవంతంగా కొనసాగుతుందన్నారు. ప్రతిఒక్కరు భక్తి భావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'పదేళ్లలో కేసీఆర్ చేసిందేమీ లేదు'


రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

బల్మూర్: పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని అన్ని వర్గాల వారిని పట్టించుకోలేదని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పోలిశెట్టిపల్లి శివారులోని ఏసీఆర్ గార్డెన్‌లో శుక్రవారం లబ్ధిదారులకు రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని విస్మరించారు. కేసీఆర్ కుటుంబం రాష్ట్ర సంపదను దోచుకుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్నారని కొనియాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ఉనికి కోసమేనని ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఓబీసీసెల్ జిల్లా చైర్మన్ గిరివర్ధన్‌గౌడ్, నాయకులు కాశన్నయాదవ్, మోహన్‌రెడ్డి, రాంప్రసాద్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, శ్రీనువాసులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

చారకొండ: మండలంలోని ఇసుక తరలింపు చేస్తున్న ట్రాక్టర్‌లను నెమ్మదిగా వెళ్లమని అనడంతో యువకుడిని దాడి చేసి గాయపరిచిన సంఘటన గోకారంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోకారం చెరువు నుంచి నిత్యం అనుమతుల పేరిట చెరువు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. రోజు ఇసుక ట్రాక్టర్‌లు వెళ్లడంతో పొలాలకు వెళ్లే దారి పూర్తి బురదమయంగా మారింది. ఈ దారిగుండా వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లకు గ్రామానికి చెందిన యువకుడు ఎం.సాయి కూమార్ నెమ్మదిగా వెళ్లండని చెప్పాడు. చంద్రాయన్‌పల్లికి చెందిన డ్రైవర్ కోపోద్రిక్తుడై యువకుడిపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయ పరిచాడు. కన్నుకు బలంగా దెబ్బతగిలడంతో స్థానికంగా చికిత్స పొందాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సీసీ రోడ్డు పరిశీలన



తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల ఆవరణంలో సీసీ రోడ్డును శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా కార్యాలయ ఆవరణ అంతా సీసీ ఏర్పాటు చేశారు. అధికారులతో పలు విషయాలపై చర్చించారు.

అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

పెంట్లవెల్లి: అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి డీటీ హనుమంతునాయక్ హెచ్చరించారు. మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రెండు రోజుల కిందట పెంట్లవెల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో బియ్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. ఎస్‌ఓ సువర్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల బియ్యం స్టాక్ రిజిస్టర్‌ను, వంటగది, వండిన అన్నం, కూరలు వంటి వాటిని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఆర్‌ఐ బాలకోటి యానాయర్, ఎస్‌ఓ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో నానో యూరియా

లింగాల: మండలంలో నానో యూరియా అందుబాటులో ఉందని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.అనిల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. యూరియా స్థానంలో నానో యూరియా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. తక్కువ మోతాదులో ఎక్కువ ఫలితాన్ని ఇస్తుందని తెలిపారు. నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుందని ఎకరానికి 500 మి.లీ నానో సరిపోతుందని తెలిపారు. ప్రస్తుతం వాడుతున్న యూరియాలో 50 శాతం నత్రజని ఉంటుందని, అదే నానోలో 80 శాతం ఉంటుందని వివరించారు. డ్రోన్ సహాయంతో పంటపై పిచికారి చేయవచ్చని వివరించారు. నానో యూరియా కావాల్సిన రైతులు మండల వ్యవసాయశాఖను సంప్రదించాలని ఏఓ కోరారు.

అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

లింగాల: గ్లోబల్ టైగర్ డే 2025 సందర్భంగా న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ చేతుల మీదుగా గత నెల 29న అవార్డు అందుకున్న లింగాల రేంజ్‌లో పని చేస్తున్న అటవీ శాఖ బీట్ ఆఫీసర్ ఎం.డీ ఖాదర్ పాషను శుక్రవారం మండల కేంద్రంలోని జామా మసీద్‌లో కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. నల్లమల అటవీ సంరక్షణ, పులుల రక్షణలో చేసిన ఉత్తమ సేవలు అందించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు ఇస్మాయిల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

కల్వకుర్తి రూరల్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కల్వకుర్తి మండలం గుండూరు గ్రామానికి చెందిన శేఖర్‌కు రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్‌ను హైదరాబాదులోని క్యాంప్ కార్యాలయంలో ఆయన అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, సురభి వెంకటేశ్వరరావు, నంబి శంకర్, రాములు యాదవ్, వెంకటయ్య యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన హుండీ



అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లి శివారులో ఆలయంలో ఉండే ఓ హుండీ శుక్రవారం రోడ్డున పక్కన వాహనదారులకు, బాటసారులకు కన్పించింది. రోడ్డు పక్కన పడేసిన హుండీ ఏ ఆలయంలోనైనా చోరీ చేసి ఉంటారని ఫొటో తీసి వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేశారు. గమనించి కొందరు అచ్చంపేట పట్టణంలోని బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన హుండీగా గుర్తించారు. బొడ్రాయి కమిటీ నిర్వాహకులు అక్కడికి వెళ్లి హుండీని తీసుకొచ్చారు. కాగా పాతబజార్‌లో బొడ్రాయి పండుగను కొన్ని నెలల కిందట నిర్వహించారు. సీసీ కెమెరాలను పైకి ఎత్తి గుర్తు తెలియని వ్యక్తులు హుండీనే ఎత్తుకెళ్లారని స్థానికులు తెలిపారు. హుండీలో సుమారు రూ. 50వేలకు పైగా ఉండొచ్చని భక్తులు వివరించారు. అచ్చంపేట పట్టణంలో మరోచోట గురువారం రాత్రి చోరీ జరిగిందని తెలిసింది. ఈ విషయమై అచ్చంపేట పోలీసులను అడగగా ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పేర్కొన్నారు.

అడ్మిషన్ల పేరుతో డబ్బులు వసూలు?

కందనూలు: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను చేర్చుకునేందుకు పాఠశాల ప్రిన్సిపాల్ పేరుతో వార్డెన్, సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఇద్దరు విద్యార్థులను పాఠశాలలో అడ్మిషన్ చేసుకునేందుకు రూ.10 వేలు డిమాండ్ చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా పాఠశాల ఆవరణలో ఉన్న పాత సామాగ్రిని వాహనాల్లోకి తీసుకెళ్లడానికి విద్యార్థులతో పని చేయిస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా అడ్మిషన్ల కొరకు డబ్బులు వసూలు చేసిన విషయం తనకు తెలియదని విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు. డబ్బులు తీసుకున్నట్లు విచారణలో తేలితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోస్టర్ విధానాన్ని వెంటనే మార్చాలి



అచ్చంపేట రూరల్: గ్రూప్–3లో కేటాయించిన రోస్టర్ విధానాన్ని వెంటనే మార్చాలని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు కల్ముల బాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాలమహానాడు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎస్సీల విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక స్థితిగతులను, జనాభాను శాస్త్రీయబద్ధంగా సర్వే చేయకుండా రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ వర్గీకరణ మూడు గ్రూపులుగా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రామకోటి, మల్లికార్జున్, అనీల్, పాండు, రాజేష్, సత్యం, వెంకట్‌నారాయణ, అంజి, ప్రభాకర్, ఆంజనేయులు, స్వామి, వేద వ్యాస్, గిరి, రాము, రాజు పాల్గొన్నారు.

మహాసభలకు తరలిన సీపీఐ శ్రేణులు


కొల్లాపూర్ నుంచి మహాసభలకు వెళ్తున్న సీపీఐ నాయకులు

కొల్లాపూర్: కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ పార్టీ జిల్లా మహాసభలకు కొల్లాపూర్ నుంచి ఆపార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. గ్రామాల నుంచి వాహనాల్లో బయలుదేరిన సీపీఐ నాయకులు కొల్లాపూర్ పట్టణంలో వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో సీపీఐ పార్టీని బలమైన శక్తిగా తీర్చిదిద్దుతామన్నారు. ర్యాలీలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఎస్‌ఎండీ ఫయాజ్, తుమ్మల శివుడు, ఇందిర, యూసూఫ్, కురుమయ్య తదితరులు ఉన్నారు.

తాడూరులో..

తాడూరు: మండల కేంద్రంతో ఆయా గ్రామాల నుంచి సీపీఐ నాయకులు కల్వకుర్తి మహాసభలకు తరలివెళ్లారు. మండల సమితి సభ్యులు భరత్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కూలీల హాజరు నమోదుపై శిక్షణ

తెలకపల్లి: మండల కేంద్రంలో మండల కాంప్లెక్స్ మీటింగ్ హాలులో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి సిబ్బంది, మేట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మొబైల్ మానిటరింగ్ సిస్టర్ జిల్లా అధికారుల ఆదేశానుసారం శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీలకు ఉపాధి పని ప్రదేశంలో కూలీల హాజరు, ఎన్నిసార్లు నమోదు చేయాలో చంద్రసిద్దార్థ అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో కూలీల నమోదు చేయడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఈసీ రామస్వామి, మేట్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఉమ్మడి జిల్లా డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పసుల రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తోటపల్లిలో ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రేషన్ కార్డు పంపిణీ చేస్తుందన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందన్నారు. అందరు సహకరించాలని కోరారు. గ్రామ అధ్యక్షుడు మట్ట శ్రీనివాస్ గౌడ్, నారాయణ, వెంకటయ్య, కుమారస్వామి, జంగయ్య పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలి

కొల్లాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ పార్టీ 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. ఇది స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆడుతున్న రాజకీయ డ్రామా అన్నారు. రిజర్వేషన్ల అమలు పట్ల కాంగ్రెస్‌పార్టీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలకు వెంటనే రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. సమావేశంలో పలువురు నాయకులు ఉన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

కల్వకుర్తి రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి అన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అనితకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 23 నుంచి దశలవారి ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు, సైదులు, రాజేందర్, ఫిరోజ్, ప్రశాంత్, రాములు, సందీప్, ప్రకాష్, మల్లేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

చారకొండ: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఈఓ వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో శాంతిగూడెం, అగ్రహారంతండా, సిర్సనగండ్ల గ్రామాల్లో శుక్రవారం ఏఈఓ వంశీ పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగులో మొదటగా కలుపు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. పత్తి పంటలకు తెల్లదోమ, పచ్చదోమ, తామర పురుగు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

ఘనంగా గంగమ్మ, సుంకులమ్మ బోనాలు



పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో శుక్రవారం గంగమ్మకు, సుంకులమ్మకు గ్రామ మత్స్యకారులు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్తుండగా బాణాసంచా కాల్చుతూ డప్పులకు అనుగుణంగా నృత్యాలు చేశారు. మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. కృష్ణమ్మ, గంగమ్మకు, సుంకులమ్మకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

లింగాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. మండలంలోని శాయిన్‌పేట, దత్తారంలో ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. మంజూరు పత్రాలను పొందిన లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. బిల్లులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకోవాలన్నారు.